సాక్షి
సంగారెడ్డి
ఆదివారం । 24 । నవంబర్ । 2024



చలిలో పారిశుద్ధ్య కార్మికులు



సిద్దిపేటలో రోడ్డు ఊడుస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు

సఫాయి.. నీకో సలాం!

సండే స్పెషల్

- కోడికూతకు ముందే పనుల్లోకి, అర్ధరాత్రి వరకు వీధుల్లోనే..
- చలిలో రక్షణ కవచాలు లేకుండానే విధుల్లోకి కార్మికులు
- బండెడు చాకిరీ చేసినా బతుకు బండి నడిచేది కష్టమే
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 8,847 మంది పారిశుద్ధ్య కార్మికులు

ఊరంతా నిద్రలో.. వారంతా పనిలో..

మనం మేలుకోక ముందే వాళ్లు పని మొదలు పెడుతారు. మన ఊరిని.. వీధిని.. మన కోసం శుభ్రం చేస్తారు. రెక్కలు ముక్కలు చేసుకున్నా.. బతుకులో మార్పురాని నిరుపేదలు వాళ్లు.. చీపురు పట్టి ఊడ్చి ఊడ్చి వెన్ను నొప్పితో బాధపడే శ్రామికులే పారిశుద్ధ్య కార్మికులు. అత్తెసరు వేతనం.. అందులోనూ కోత. నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన గ్లౌజ్‌లు, సబ్బులు, నూనెలు, బూట్లు ఎప్పుడోగాని ఇవ్వరు. అయినా చలికి వణుకుతూ విధులు నిర్వహించక తప్పని పరిస్థితులు. రక్షణ కరువై విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదాల బారిన పడితే వీరి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలోని పారిశుద్ధ్య కార్మికుల పరిస్థితి అధ్వానంగా మారింది. శనివారం తెల్లవారు జామున 'సాక్షి'పరిశీలనకు వెళ్లగా కార్మికుల దుర్భర స్థితిగతులు కళ్లకు కనిపించాయి. 8లో

- దొంతి నరేష్‌గౌడ్, మెదక్ మున్సిపాలిటీ / గజవెల్లి షణ్ముఖరాజు, సాక్షి, సిద్దిపేట

న్యూస్‌రీల్

చేప పిల్లలను వదిలిన ఎమ్మెల్యే చింతా

సదాశివపేట (సంగారెడ్డి): ప్రభుత్వం చేపట్టిన చేప పిల్లల పంపిణీలోభాగంగా పట్టణంలోని ఊబచెరువులో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మత్స్యశాఖ అధికారులు, మత్స్య సహకార సంఘం సభ్యులతో కలసి 27,977 వేల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...చేప పిల్లల పంపిణీతో మత్స్యకారులకు జీవనోపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు ఆకుల శివకుమార్, సతాని శ్రీశైలం, మత్స్యశాఖ ఏడీ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి



డీఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్‌ఐ నరేశ్

ఝరాసంగం(జహీరాబాద్): సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన ఝరాసంగం పోలీస్ స్టేషన్‌ను ఆయన శనివారం తనిఖీ చేసి పీఎస్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మండలంలో శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని అనవసర లింకులు ఓపెన్ చేయరాదని సూచించారు. కార్యక్రమంలో జహీరాబాద్ రూరల్ సీఐ హన్మంతు, ఎస్‌ఐ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



స్వీట్లు పంపిణీ చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

పటాన్‌చెరు టౌన్: ప్రియంకాగాంధీ వయ్‌నాడు పార్లమెంట్ ఉపఎన్నికల్లో గెలుపొందిన నేపథ్యంలో పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద శనివారం సాయంత్రం స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

చిన్న గుడ్లను వెనక్కి పంపండి

జిల్లా సంక్షేమ అధికారి లలితా కుమారి

జోగిపేట(అందోల్): అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసే గుడ్లు చిన్న సైజులో ఉంటే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు తీసుకోవద్దని జిల్లా సంక్షేమ అధికారి లలితా కుమారి సూచించారు. అందోల్–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. లలితా కుమారి వెంట సీడీపీవో ప్రియాంక, సూపర్‌వైజర్ రాజేశ్వరి ఉన్నారు.

గ్రామీణాభివృద్ధే కేంద్రం లక్ష్యం



సభ్యులను సన్మానిస్తున్న అధికారులు

పటాన్‌చెరుటౌన్: దేశంలో నేటికీ క్షేత్రస్థాయిలో 70% గ్రామీణ వాతావరణమే కనిపిస్తుందని గ్రామీ ణ ప్రాంతాల పురోగతే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని అఖిల భారత సర్వీసుల్లోని సభ్యుల బృందం ప్రతినిధి వసంత్ కుమార్ పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని నందిగామ గ్రామంలో ఐదు రోజులపాటు ఈ బృందం పర్యటించనుంది. గ్రామంలోని హెల్త్, అంగన్‌వాడి ఐసీడీఎస్, ఆశ, డ్వాక్రా మహిళలతో బృందంలోని సభ్యులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...శిక్షణలో భాగంగా గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవన విధానం తెలుసుకునేలా సంగారెడ్డి జిల్లాలో నందిగామ, కొడకంచి, శివంపేట్, మల్లేపల్లి, వెల్టూర్‌లో ఆరు బృందాలు ఐదు రోజులపాటు గ్రామాల్లో, రెండు రోజులపాటు మున్సిపాలిటీలలో పర్యటిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో చేతన్ కుమార్ బీవీ.స్వాతి సందీప్, పల్వే వికాస్ బాల సాహెబ్, స్వాతి గుప్తా,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వాళ్లనూ బదిలీ చేద్దాం

- బదిలీలు చేయాలనే యోచనలో ఉన్నతాధికారులు
- చెరువుల కబ్జాలకు వంతపాడారని పలువురిపై ఆరోపణలు
- చాలా ఏళ్లుగా పాతుకుపోయిన కొందరు అధికారులు
- ఇప్పటికే ఈఏ, ఈఈ, ఎస్‌ఈ స్థాయిల్లో బదిలీలు

ఎట్టకేలకు ఇరిగేషన్ డీఈలకు స్థానచలనం!



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: నీటిపారుదల శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ (డీఈ) ఇంజనీర్ల బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. చాలా ఏళ్లుగా ఒకే చోట పాతుకు పోయిన కొందరు అధికారులకు స్థానచలనం కల్పించాలని ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు యోచిస్తున్నారు. ఇప్పటికే ఏఈలు, ఈఈల బదిలీలు జరగ్గా డీఈలను మాత్రం ట్రాన్స్‌ఫర్ చేయలేదు. దీంతో త్వరలోనే ఈ క్యాడర్ అధికారులను బదిలీ చేసే యోచనలో ఆ శాఖ ఈఎన్‌సీ ఉన్నట్లు నీటిపారుదలశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లాలో సంగారెడ్డి, పటాన్‌చెరు, అందోల్, సింగూరు, మునిపల్లి, దౌల్తాబాద్‌లలో ఈడీ కార్యాలయాలు ఉన్నాయి. అలాగే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో కూడా డీఈ పోస్టులు ఉన్నాయి. అలాగే నారాయణఖేడ్ డివిజన్‌లో నారాయణఖేడ్, కంగ్టి, కల్హేర్, నల్లవాగు, మనూరు, నాగల్‌గిద్దల్లో ఈ పోస్టులు ఉన్నాయి. గత ప్రభుత్వం సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలను నిర్మించాలని నిర్ణయించిన నేపథ్యంలో నారాయణఖేడ్ డివిజన్‌లో దాదాపు ప్రతీ మండలానికి ఒక డీఈని నియమించింది. అలాగే జహీరాబాద్ డివిజన్‌లోనూ కూడా డీఈ పోస్టులు ఉన్నాయి.

చెరువుల కబ్జాలు వీరి కనుసన్నల్లోనే..

జిల్లాలో కొందరు డీఈలపై అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువులు కబ్జా చేసే వారికి పరోక్షంగా సహకరిస్తున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. బహిరంగంగానే చెరువుల్లో మట్టి నింపి కబ్జాలకు పాల్పడుతుంటే అడ్డుకోవాల్సిన ఈ అధికారులు కళ్లు మూసుకుని కాసులు దండుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. చెరువుల కబ్జాలపై గ్రామస్తులు, స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చినా కూడా ఈ అధికారులు చర్యలు కూడా తీసుకోలేదు సరికదా..కబ్జాదారుల నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు దండుకుని రూ.కోట్లకు పడగలెత్తారనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా హెచ్‌ఎండీఏ మండలాల పరిధిలో ఉన్న ఈ డీఈలపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చెరువుల కబ్జాలపై ప్రత్యేక దృష్టి సారించింది. హైడ్రా ద్వారా కబ్జాలను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో కబ్జాలకు సహకరించిన కొందరు అధికారులు ఇప్పుడు అక్కడే ఉండటంతో ఈ కబ్జాల తొలగింపుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు బదిలీలు కాని ఈడీలకు స్థానచలనం కల్పించే యోచనలో ఈ శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు.

అన్ని క్యాడర్లలో బదిలీలైనప్పటికీ..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో క్షేత్రస్థాయిలో పనిచేసే ఇంజనీరింగ్ అధికారులందరికీ దాదాపుగా స్థానచలనం కలిగింది. ఆయా మండలాల అసిస్టెంట్ ఇంజనీర్లకు చాలామందిని బదిలీలు చేసింది. కొత్తగా నియామకమైన ఏఈలకు పోస్టింగ్‌లు ఇస్తున్న తరుణంలో చాలామంది ఏఈలు బదిలీల కోసం దరఖాస్తులు పెట్టుకున్నారు. ఇలా దరఖాస్తులు పెట్టుకున్న ఏఈలను బదిలీ చేశారు. అలాగే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను కూడా ప్రభుత్వం మార్చింది. జిల్లాలో అందరు ఈఈలకు బదిలీ జరిగింది. మరోవైపు ఎస్‌ఈలకు కూడా ట్రాన్స్‌ఫర్‌లు అయ్యాయి. ఆయా పోస్టుల్లో గత కొన్ని నెలల క్రితమే కొత్త వాళ్లు చేరారు. కానీ డీఈలకు మాత్రం బదిలీలు జరగలేదు. దీంతో ఇప్పుడు డీఈ క్యాడర్ అధికారులను బదిలీ చేయాలని నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు యోచిస్తున్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి



సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో వివరాలు తెలుసుకుంటున్న ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

సంగారెడ్డి/జోగిపేట(అందోల్): అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలని, అధికారులు తప్పులు లేని ఓటరు జాబితా లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ...ఓటర్ నమోదు ప్రక్రియలో భాగంగా అధికారులు విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా తయారు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ పనులు వేగవంతంగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అంతకుముందు చౌటకూర్ మండలం శివమ్‌పేటలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం సంగారెడ్డి, అందోల్ ఆర్డీవో కార్యాలయాలు తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలసి సమావేశం నిర్వహించారు. స్థానిక బీఎల్‌వోలతో మాట్లాడి ఫారం 6, 7, 8 ఆన్లైన్, సాధారణ దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లాలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు ఆర్డీవోలు రవీందర్ రెడ్డి పాండు, తాహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు పరిశీలన

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని శనివారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరుతో కలసి అందోల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో తనిఖీ చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఇప్పటివరకు నమోదైన వివరాలు, ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలను ఆర్డీవో పాండును అడిగి తెలుసుకున్నారు. సంగారెడ్డి పట్టణంలోని తారా డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. టేక్మాల్ మండలంలో నాలుగు పోలింగ్ కేంద్రాలను పెంచిన విషయం అధికారులు వివరించారు. ఇంటింటి సర్వేపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, తహసీల్దారు విష్ణు సాగర్, డిప్యూటీ తహసీల్దార్లు మధుకర్‌రెడ్డి, చంద్రశేఖర్ (ఎన్నికలు)లతో పాటు పలువురు పాల్గొన్నారు.

వరికొయ్యలు కాల్చితే కాలుష్యమే!



వరి కొయ్యలు కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యంతోపాటు సాగుకు ఉపయోగపడే మిత్రపురుగులు నశిస్తాయని, దీనివల్ల భూమిలో ఉండే పోషకాలు తగ్గి పంట దిగుబడి పడిపోతుందని రైతులకు అధికారులు ఎంత చెబుతున్నా వారి మాటలు చెవికెక్కించుకోవడం లేదు. అందుకు ఇదిగో ఈ ఫొటోనే సాక్ష్యం. శనివారం సంగారెడ్డి పట్టణానికి ఆనుకుని ఉన్న పొలంలో ఓ రైతు వరికొయ్యలు ఇలా తగలబెడుతుండగా 'సాక్షి'కంటికి చిక్కింది. - సంగారెడ్డి రూరల్

నిలోఫర్‌లో శిశువు అపహరణ

- బుర్ఖాలో వచ్చి..ఆటో ఎక్కి పరారీ
- ఇంటికి వెళ్లే సమయంలో ఘటన



నాంపల్లి: నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నిలోఫర్ ఆస్పత్రి వద్ద ఓ పసికందు అపహరణకు గురైంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..జహీరాబాద్‌కు చెందిన హసీనాబేగం, గఫార్ దంపతులకు నెల రోజుల క్రితం ఒక మగ శిశువు జన్మించాడు. శిశువుకు పచ్చ కామెర్ల వ్యాధి సోకడంతో బాబును నిలోఫర్ ఆస్పత్రిలో చేర్పించారు. వ్యాధి నుంచి కోలుకున్న శిశువును శనివారం డిశ్చార్జ్ చేశారు. డిశ్చార్జ్ అయ్యాక శిశువు తల్లి, శిశువు అమ్మమ్మ పైఅంతస్తులోని వార్డు నుంచి కిందకు చేరుకున్నారు. మందులు తీసుకునేందుకు తల్లి కౌంటర్ వద్దకు వెళ్లింది. ఆ సమయంలో శిశువు అమ్మమ్మ చేతిలో ఉంది. ఇదే సమయంలో బుర్ఖా ధరించిన ఓ మహిళ అక్కడకు చేరుకుంది. తాను ఆస్పత్రి సిబ్బంది అని మాయమాటలు చెప్పి..వృద్ధురాలి చేతిలో ఉన్న శిశువును తీసుకుంది. కాసేపు ఎత్తుకుని మాట్లాడిస్తున్నట్లు నటిస్తూ అక్కడ నుంచి నిష్క్రమించింది. శిశువు ఆచూకీ కోసం ఆస్పత్రి ప్రాంగణమంతా తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో నాంపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆస్పత్రి నుంచి శిశువును ఎత్తుకుని బయటకు వెళ్లిన మహిళ బుర్ఖాలో వచ్చినట్లు పోలీసులు సీసీ పుటేజీలో గుర్తించారు. ఆటోలో వెళ్లిన మహిళ కొంతదూరం వెళ్లాక ఆటో దిగి మరో ద్విచక్ర వాహనాన్ని ఎక్కి పారిపోయింది.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు

కలెక్టర్ వల్లూరు క్రాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్: ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులు, పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులతో పాటు వివిధ రకాల సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో శనివారం జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లతో ధరణి పెండింగ్ సమస్యలు, ప్రజావాణి, ఓటరు నమోదు ఎస్ఎస్ఆర్–2025 తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ధరణి, ప్రజావాణి సమస్యల పరిష్కారం, ఓటరు నమోదు తదితర అంశాలలో రెవెన్యూ యంత్రాంగం ప్రధాన భూమిక పోషించాలన్నారు. ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపాలని మండల తహసీల్దార్లను ఆదేశించారు. ధరణి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రజావాణిలో పెండింగ్ దరఖాస్తులు వచ్చే నెల మొదటి వారంలోగా పూర్తి చేయాలన్నారు.

చివరిదశకు చేరుకున్న ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో ధాన్యం కొనుగోలు చివరిదశకు చేరుకుందని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. జిల్లాలోని వివిధ మండలాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 1,10,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడంతో పాటుగా రైతుల ఖాతాలో రూ.160 కోట్లను జమ చేసినట్లు తెలిపారు.

11.50 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి !

జిల్లాలో పత్తి 3.48 లక్షల ఎకరాల్లో పత్తి పంట పండిందని, దాదాపు 11.50 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి వచ్చే అవకాశం వుందని కలెక్టర్ వివరించారు. ఇప్పటివరకు 1.5 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇతర జిల్లాల్లో వసతిగృహాల్లో, పాఠశాలల్లో ప్రత్యేక అధికారులు, ఆర్డీవోలు తహసీల్దార్ ఎంపీడీవోలు విధిగా తనిఖీలు చేయాలని స్పష్టం చేశారు. తనిఖీల సందర్భంగా విద్యార్థులతో కలసి భోజనం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఆర్వో పద్మజారాణి, జిల్లా వ్యవసాయాధికారి శివకుమార్, డీఎండీసీఎస్ కొండలరావు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకే సైన్స్

- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్
- ముగిసిన నేషనల్ ఇన్‌స్పైర్, బాల వైజ్ఞానిక ప్రదర్శనలు



ఇన్‌స్పైర్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో అదనపు కలెక్టర్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జీవన ప్రమాణాలలో సైన్స్ ఒక భాగమని, సైన్స్ లేకుంటే జీవితమే సైలెన్స్ అవుతుందని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సుకే సైన్స్‌ను ఉపయోగించాలని ఆయన సూచించారు. సంగారెడ్డిలోని శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో గత మూడు రోజులుగా జరిగిన నేషనల్ ఇన్‌స్పైర్, బాల వైజ్ఞానిక ప్రదర్శనల ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ ముగింపు వేడుకల సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించారు. నేషనల్ ఇన్‌స్పైర్‌లో 89కి గానూ రాష్ట్రస్థాయికి 9 ప్రాజెక్టులను ఎంపిక చేయగా, బాల వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రాథమికోన్నతస్థాయిలో 14, ఉన్నత పాఠశాల స్థాయిలో 14 ప్రాజెక్టులు, రెండు ఉపాధ్యాయ ప్రదర్శనలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. ఎంపికైన ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులతోపాటు గైడ్ టీచర్లకు జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ జ్ఞాపికలతోపాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...సైన్స్‌లో రోజుకొక కొత్త ఆలోచనలు, నూతన ఆవిష్కరణలు వస్తూనే ఉంటాయన్నారు. ఇన్‌స్పైర్‌లో దేశంలో 27 వేల ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికైతే అందులో తెలంగాణ నుంచి 3 వేలు కాగా, అందులో ఏకంగా సంగారెడ్డి జిల్లా నుంచి 95 ప్రాజెక్టులు ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమని తెలిపారు. అనంతరం సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్ మాట్లాడుతూ...ఐఐటీ కందిలో ఇటీవలే డ్రైవర్ లేకుండా నడిచే వాహనాలను రూపొందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా నోడల్ అధికారి లింబాజి నేషనల్ ఇన్‌స్పైర్ పరిశీలకులు సుబ్రత్, సెయింట్ ఆంథోనీస్ పాఠశాలల అధినేత సాల్మోన్ రెడ్డి, సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, ఎంఈవోలు జాకీర్ హుస్సేన్, విద్యాసాగర్, భీంసింగ్ పాల్గొన్నారు.

నేషనల్ ఇన్‌స్పైర్‌కు ఎంపికైన ప్రాజెక్టులు

- జెడ్పీహెచ్‌ఎస్ ఇంద్రకరణ్ విద్యార్థి సౌజన్య రూపొందించిన 'ది ఫ్లెక్సీ షూస్'
- త్రివేణి స్కూల్ ఇస్నాపూర్ విద్యార్థి అఖిలేశ్వర్ రెడ్డి రూపొందించిన 'బై డైరెక్షనల్ యాక్సిడెంట్ ప్రివెన్షన్ సిస్టమ్ ఫర్ ట్రైన్స్'
- త్రివేణి స్కూల్ ఇస్నాపూర్ విద్యార్థి సుశాంత్‌రెడ్డి రూపొందించిన 'ఎలక్ట్రిక్ ప్రొటెక్షన్ ఫర్ ఎగ్జామ్ పేపర్'
- ఓక్‌డెల్ ఇంటర్నేషనల్ స్కూల్ వడక్‌పల్లి విద్యార్థి ఆయుష్‌కుమార్ రూపొందించిన 'టాక్‌గురు ట్రాన్సెండింగ్ కమ్యూనికేషన్ బేరియర్స్'.
- జెడ్పీహెచ్‌ఎస్ గుమ్మడిదల విద్యార్థి ప్రణీత్ రూపొందించిన 'సంజీవని హెలికాప్టర్'
- జ్యోతి విద్యాలయ ఉన్నత పాఠశాల బీహెచ్‌ఈఎల్ విద్యార్థి శాశ్వత రూపొందించిన 'ట్రీ కటింగ్ నోటిఫైయర్'
- పయనీర్స్ స్కూల్ సంగారెడ్డి విద్యార్థి రుద్ర శరణ్య రూపొందించిన 'మల్టీపర్పస్ లోడ్ క్యారియర్ ఫర్ హోమ్ నీడ్స్'
- ఓక్‌డేల్ ఇంటర్నేషనల్ వడక్‌పల్లి విద్యార్థి దిశిత వర్మ రూపొందించిన 'ది షాక్ బస్టర్'
- భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూల్ బీహెచ్‌ఈఎల్ విద్యార్థి పూర్విత్‌రెడ్డి రూపొందించిన 'హెల్పింగ్ విజువల్లీ డిసేబుల్డ్ పీపుల్ విత్ ద యూజ్ ఆఫ్ ఏ1'.

క్లుప్తంగా

తేనెలాంటి తెలుగును మరువొద్దు

అష్టావధాన పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు దత్తాత్రేయశర్మ



మాట్లాడుతున్న భానుప్రకాశ్

హవేళీఘణాపూర్(మెదక్): విద్యార్థులు తేనెలాంటి తెలుగును మరిచిపోకుండా బాల్యం నుంచే తెలుగులో మాట్లాడుతూ తెలుగును వెలుగులోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందని అష్టావధాన పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు దత్తాత్రేయశర్మ అన్నారు. శనివారం మండల కేంద్రమైన జెడ్పీ హైస్కూల్‌లో ప్రముఖ యువ అవధాని అవుసుల భానుప్రకాశ్ అష్టావధానం, బాలసాహితీ వేత్త, స్థానిక తెలుగు ఉపాధ్యాయులు ఉంద్రాళ్ల రాజేశం రచించిన బాలలార శతకం పుస్తకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే సాహిత్యం వైపు విద్యార్థులు దృష్టి సారించినట్లయితే భవిష్యత్‌లో ఏ రంగంలో ఉన్న సమాజ సేవకు పాటుపడుతారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మధుమోహన్, హెచ్ఎంలు కరుణాకర్, మీరా, రాజశేఖర్, సత్యం, శశికుమార్, రాజు, శ్యామశ్రీ, ఎల్లం, యాదగిరి, చంద్రం, తిరుపతి, ఉపాధ్యాయులు నల్ల అశోక్, ఎల్లమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు ప్రారంభం

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం 9వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ బాలుర చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. 20 జిల్లాల జట్లు పాల్గొనగా, కార్యక్రమానికి ఎంఈఓ లీలావతి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ, సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి శోభన్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అభిషేక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాం సుందర్ శర్మ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు రంగారెడ్డి, కార్యదర్శి హరిరంజన్ శర్మ, హెచ్ఎం ధర్మపురి, మాజీ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సిద్దిరాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఊరంతా నిద్రలో.. వారంతా పనిలో..!

- చలికి వణుకుతున్న పారిశుద్ధ్య కార్మికులు
- కోడికూతకు ముందే పనుల్లోకి, అర్ధరాత్రి వరకు వీధుల్లోనే
- రక్షణ కవచాలు లేకుండానే విధుల్లోకి కార్మికులు



సిద్దిపేటలో రోడ్డు ఊడుస్తున్న కార్మికురాలు

ఊరంతా నిద్రలో ఉండగానే.. వారంతా చీపురు చేతపట్టి రోడ్లు శుభ్రం చేస్తుంటారు. రెక్కలు ముక్కలు చేసుకున్నా.. బతుకులో మార్పురాని నిరుపేదలు. వ్యాధులు, దోమల నుంచి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు తమ ప్రాణాలు, ఆరోగ్యాలను పణంగా పెడుతున్నారు. సాధారణ రోజుల్లో సరే.. చలికాలంలో సైతం వారికి ఎలాంటి రక్షణ సామగ్రి అందించక పోవడంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో పారిశుద్ధ్య కార్మికులు వణికిపోతున్నారు. రక్షణ కరువై విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. కార్మికులపై అటు అధికారులు, ఇటు ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. శనివారం 'సాక్షి' పరిశీలనలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

8,847 మంది పారిశుద్ధ్య కార్మికులు

ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని 8,847 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. అందులో మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య కార్మికులు 1,839, పల్లెల్లో 7,008 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. రెండు షిఫ్ట్‌ల్లో విధులకు హాజరవుతారు. పలు మున్సిపాలిటీల్లో బయోమెట్రిక్ ద్వారా అటెండెన్స్, మరికొన్ని మున్సిపాలిటీల్లో రిజిస్టర్ ద్వారా హాజరు తీసుకుంటారు. ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఒక షిఫ్ట్, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు మరో షిఫ్ట్ పనులు చేస్తారు. కాలనీల్లో ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించడం, సైడ్ కాలువలు శుభ్రం చేయడం, రోడ్లు ఊడ్చడం వారికి కేటాయించిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమైపోతున్నారు.

జిల్లా	మున్సిపాలిటీల్లో	గ్రామాల్లో	కార్మికులు
సిద్దిపేట	600	2,256	2,856
సంగారెడ్డి	928	3,048	3,976
మెదక్	311	1,704	2,015



సిద్దిపేటలో వార్డుల్లోకి తీసుకెళ్తున్న మున్సిపల్ జవాన్

మెదక్ మున్సిపాలిటీ/సాక్షి, సిద్దిపేట: కరోనా మహమ్మారి ప్రపంచాన్ని గడగడలాడించిన సమయంలో కరోనా వారియర్స్‌గా ముందు వరుసలో నిలిచింది వైద్య సిబ్బంది. అయితే వారి తర్వాతే ఉన్నది మరెవరో కాదు ప్రతీ రోజు మనకు కనిపిస్తునే ఉన్నా కావాల్సినంత గుర్తింపు పొందని పారిశుద్ధ్య కార్మికులు. ఇంట్లో మనిషిని ముట్టుకోవడానికే వణికే రోజుల్లో పల్లె, పట్టణాలను శుభ్రం చేస్తో బతుకుపై భరోసా కలిగించిన వీరులు వారు. వీరి శ్రమను ఎంత పొగిడినా తక్కువే. పట్టణం నిద్రపోతున్న వేళ.. విధులు నిర్వహించే వీరికి ఎటువంటి సవాళ్లు ఎదురవుతున్నాయి..? జీతభత్యాలు, గౌరవం ఏ మేరకు దక్కుతున్నాయి..? ఒకసారి వారి బతుకు చిత్రాన్ని చూస్తే అది అర్థమవుతుంది.

చలికి వణుకుతూ

వర్షం.. చలి, ఎండను లెక్క చేయకుండా పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తుంటారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పనులు చేస్తుంటారు.. చలికాలంలో ఎముకలు కొరికే చలిలో.. వేసవి కాలంలో ఎండ కొడుతున్నా.. వర్షా కాలంలో వర్షానికి తడుస్తూనే పల్లెలు పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తున్నారు. దోమలు వృద్ధి చెందకుండా దోమల మందును స్ప్రే చేస్తుంటారు. కరోనా విలయతాండవం చేస్తున్న సమయంలో సైతం ప్రాణాలను లెక్క చేయకుండా ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా పారిశుద్ధ్య కార్మికులు సేవలందించారు.

ప్రాణాలను పణంగా పెట్టి

రాత్రి వేళల్లో మందు బాబులతో.. వేగంగా వాహనాలు నడిపే వారితో ఇబ్బందులు తలెత్తుతుంటాయి. రాత్రి సమయంలో మెయిన్ రోడ్డను ఊడుస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదాల బారిన పడిన ఘటనలు సైతం ఉన్నాయి. ఒక వైపు వీధి కుక్కల బెడద వెంటాడుతూనే ఉంటుంది. వీరిలో అత్యధికులు మహిళలే. పురుషులతో సమానంగా వీరు విధులు నిర్వహిస్తున్నారు.

పలువురు మృత్యువాత

సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 11న నాలా శుభ్రం చేస్తూ పారిశుద్ధ్య కార్మికుడు లంబాడీ నర్సింహులు(35) ప్రమాదవశాత్తు మృతిచెందాడు. అంత్యక్రియల నిమిత్తం మున్సిపల్ కార్యాలయం నుంచి రూ.30వేలు బాధిత కుటుంబానికి అందజేశారు.

అవుట్ సోర్సింగ్ కార్మికులే..

మెదక్ జిల్లాలో మెదక్, రామాయంపేట, తూప్రాన్, నర్సాపూర్ మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి పరిధిలో ఒక్క మెదక్ మున్సిపాలిటీలో మాత్రమే రెగ్యులర్ కార్మి కులు ఉన్నారు. మిగితా మూడు మున్సిపాలిటీల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిన కార్మికులు పనిచేస్తున్నారు. రెగ్యులర్ కార్మికులను మినహాయిస్తే మున్సిపాలిటీ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు కార్మికులను పారిశుద్ధ్య పనులకు పంపిస్తారు. మున్సిపల్ శాఖ నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్లే వేతనాలు చెల్లించాలి. కానీ కాంట్రాక్టర్లు నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మొదటి నుంచి మెదక్ మున్సిపాలిటీలో ఏళ్ల తరబడి పని చేస్తున్న కార్మికులు ఇంకా సమస్యలతో సహవాసం చేస్తున్నారు. కొంతమంది అధికారులు వారి ఇళ్లలోనూ కార్మికులతో పనులు చేయించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



బయోమెట్రిక్ వేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

- గతేడాది నవంబర్‌లో సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలో అంబేడ్కర్‌నగర్‌లో ఊడ్చిన చెత్తను కుప్ప చేసి పారిశుద్ధ్య కార్మికురాలు దాసరి గంగవ్వ నిప్పు అంటించగా ప్రమాదవశాత్తు చీరకు అంటుకొని మృతి చెందింది. గంగవ్వ కోడలుకు అవుట్ సోర్సింగ్‌లో మున్సిపల్‌లో ఉద్యోగం ఇచ్చారు. దళిత బంధు ఇస్తామని హామీ ఇచ్చి ఇవ్వలేదు.



ట్రాక్టర్‌లో చెత్త పోస్తున్న కార్మికుడు

రక్షణపై పట్టింపు కరువు

ప్రజల ఆరోగ్య రక్షణకు ఎంతగానో కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల రక్షణను పట్టించుకోవడం లేదు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రతీ సంవత్సరం చలికాలంలో స్వెట్టర్‌లు, చేతికి గ్లౌజులు, మాస్కులు, రూమాలు, షూ, బెల్లం, సబ్బులు, కొబ్బరి నూనె, వర్షా కాలంలో రెయిన్ కోట్‌లు ప్రభుత్వం పంపిణీ చేయాల్సి ఉండగా అది ఎక్కడా అమలు కావడం లేదు. పలు పురపాలికల్లో పర్మినెంట్ కార్మికులకు కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు అందజేస్తున్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులకు రిఫ్లెక్టివ్ జాకెట్‌లు మాత్రమే పంపిణీ చేస్తున్నారు.



- గతంలో తెల్లవారు జామున రోడ్డు శుభ్రం చేస్తున్న సమయంలో ప్రమాదాలు జరిగి ముగ్గురు కార్మికులు మృత్యువాత పడ్డారు. 2022 నవంబర్‌లో మెదక్ పట్టణంలోని మున్సిపాలిటీ సమీపంలో కారు ఢీకొని ఇద్దరు మహిళా కార్మికులు దుర్మరణం పాలయ్యారు. అలాగే ఈ ఏడాది జూలై 28వ తేదిన విధులు నిర్వహిస్తున్న మరో పారిశుద్ధ్య అవుట్ సోర్సింగ్ కార్మికుడు కారు ఢీకొని మృత్యువాత పడ్డాడు.



సంగారెడ్డిలో రోడ్లు ఊడుస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

రాత్రి తాగి వాహనాలు మీదకు వస్తున్నాయి



ఒక్కరం రోడ్డు ఊడ్చుకుంటూ వెళ్తుంటే భయమేస్తోంది. రాత్రి టైంలో తాగి బండ్లు నడిపేవారు మీదకు వస్తుంటారు. అలాగే కుక్కలు వెంబడి పడుతుంటాయి. దీంతో ఇబ్బంది అవుతుంది కానీ తప్పని పరిస్థితి. చలికి ఇబ్బంది పడుతూనే పని చేస్తున్నాం. బట్టలు, చెప్పులు, సబ్బులు, కొబ్బరి నూనె ఇస్తామని ఇవ్వలేదు. జీతాలు టైం రావడం లేదు.

–పోతుల శంకరమ్మ, నైట్ షిఫ్ట్, పారిశుద్ధ్య కార్మికురాలు

చాలీచాలని జీతంతో 28 ఏళ్లుగా..



28 ఏళ్లుగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నా. కాల్వలు శుభ్రం చేస్తాను.... చెత్త బండి మీద వెళ్లి తడి, పొడి చెత్తను సేకరిస్తాను. మురికి కుప్పలతోనే జీవనం అవుతుంది. ఒక్కోసారి స్నానం చేసిన సైతం దుర్వాసన పోదు... దీంతో మానువడు వాసన వస్తుంది పో... అని సైతం అంటాడు. చాలీచాలని జీతంతో జీవనం సాగిస్తున్నాం. మా కష్టంకు దగ్గ ప్రతిఫలం జీతం దక్కడం లేదు. మాకు జీతాలు పెంచండి.

–గుర్రం నర్సింహులు, పారిశుద్ధ్య కార్మికుడు

అన్ని సౌకర్యాలు కల్పిస్తాం



ఈ ఏడాది పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. ప్రతీ మూడు నెలలకు ఒకసారి హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేస్తాం. కార్మికులకు షూ, డ్రెస్‌లు, ఆయిల్, సబ్బులు, గ్లౌజులు అందజేస్తాం.

–అశ్రిత్ కుమార్, కమిషనర్, సిద్దిపేట పురపాలక సంఘం

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

- మరో విద్యార్థికి గాయాలు
- కళాశాలకు వెళ్తుండగా స్కూటీని ఢీకొట్టిన కారు
- సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో ఘటన



బాల మహేంద్ర మృతదేహం

పటాన్‌చెరు: రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి చెందగా, మరో విద్యార్థికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని కృష్ణా జిల్లా మామిడి ముక్కల మండలం మేడూరు గ్రామానికి చెందిన నాగబాబు కుటుంబ సభ్యులతో కలిసి కొన్నేళ్ల కిందట హైదరాబాద్ వచ్చి కూకట్‌పల్లి ప్రగతి నగర్ లో నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు బాల మహేంద్ర (19) గండి మైసమ్మలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. శనివారం బాల మహేంద్ర అతడి స్నేహితుడు సృజన్ కుమార్‌తో కలిసి స్కూటీపై కళాశాలకు బయలుదేరాడు. మార్గ మధ్యలో సుల్తాన్ పూర్ గ్రామ శివారులోని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు పై బొల్లారం వైపు నుంచి వేగంగా వస్తున్న కారు వీరి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. విద్యార్థులను మొదట పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం మదీనాగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బాల మహేంద్ర మృతి చెందాడు. మృతుడి పెద్దనాన్న మల్లికార్జున రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న గోదావరి అంజిరెడ్డి, పక్కన నాయకులు

- మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రచారాన్ని నమ్మలేదు
- బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు అంజిరెడ్డి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: దేశ ప్రజలు ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అందుకు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం నిదర్శనమని బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పేర్కొన్నారు. మహారాష్ట్రలో ఎన్డీయే కూటమి విజయం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం సంగారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ.. ఇండియా కూటమి ఇచ్చిన మోసపూరిత వాగ్దానాలను మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదనే విషయం మహారాష్ట్ర ప్రజలు అర్థం చేసుకుని...ఇండియా కూటమిని ఓడించారని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలోనూ కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని, గ్యారంటీల పేరుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అనంత రావుకులకర్ణి, జిల్లా కార్యాలయ కార్యదర్శి దోమల విజయకుమార్, జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ జగన్నాథ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన చేగుంటలో చోటు చేసుకుంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. అనంతసాగర్ గ్రామానికి చెందిన మెండె నర్సింలు(41) చేగుంటలోని వేంకటేశ్వర కట్టమిషన్‌లో కూలీ పనులు చేస్తుండేవాడు. శనివారం కట్టమిషన్‌లో యజమాని రామారావుతోపాటు నర్సింలు రంపముకు కరెంట్ యంత్రంతో సాన పడుతున్నాడు. యంత్రానికి ఒక్కసారిగా కరెంట్ షాక్ కొట్టి ఇద్దరూ కింద పడిపోయారు. వెంటనే నార్సింగి ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా నర్సింలు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రామారావు చికిత్స పొందుతుండగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

– ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

మునిపల్లి(అందోల్): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎస్ఐ రాజేశ్ నాయక్ కథనం మేరకు.. రాయికోడ్ మండలం ఇందూర్ గ్రామానికి చెందిన పట్లోళ్ల శ్రీనివాస్ రెడ్డి (40) నగిరే ప్రశాంత్ బైక్‌పై శనివారం సంగారెడ్డి వైపు వస్తుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, ప్రశాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి కుటుంబీకులు పట్లోళ్ల విజేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు బుదేరా పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని

సంగారెడ్డి టౌన్ : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. రూరల్ పోలీసుల కథనం మేరకు.. శనివారం తెల్లవారుజామున రాయికోడ్ గ్రామానికి చెందిన లింగం (25), నర్సింహులు, మోహన్ ముగ్గురూ కలిసి కంది నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తాకు ఒకే బైక్ పై వస్తున్నారు. చౌరస్తాకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో లింగం అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన ఇద్దరిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లింగం మేనమామ మొగులయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



రాత్రి వేళలో కోహీర్ ఎక్స్ రోడ్ వద్ద మంచు



రైల్వే స్టేషన్ వద్ద దట్టమైన పొగమంచు



పశువులను పొలానికి తీసుకెళ్తున్న రైతు



రైల్వే గేట్ వద్ద ఉదయిస్తున్న సూర్యుడు

చలి.. గిలి

జిల్లాలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి తీవ్రత పెరిగింది. దీంతో జనం గజగజ వణుకుతున్నారు. రాత్రి వేళ రోడ్లపైకి వచ్చేందుకు జంకుతున్నారు. ఉదయం 8 గంటల వరకు పొగమంచు అధికంగా కురుస్తోంది. కోహీర్‌లో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంది. రెండు రోజుల కిందట అత్యల్పంగా 9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. శనివారం రాత్రి 'సాక్షి' బృందం కోహీర్ సందర్శించింది. అక్కడ క్లిక్‌మనిపించిన కొన్ని దృశ్యాలివి.

బగిలి శివప్రసాద్ , సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి, బి.రాజశేఖర్, సంగారెడ్డి జోన్

పెట్రోల్ దాడి ఘటనపై విచారణ

కల్హేర్(నారాయణఖేడ్): యువతిపై పెట్రోల్‌తో దాడి చేసి నిప్పంటించిన ఘటనపై శనివారం అడిషనల్ ఎస్పీ సంజీవరావు విచారణ చేపట్టారు. నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డితో కలిసి సిర్గాపూర్ మండలం వాసర్ గ్రామాన్ని సందర్శించారు. వాసర్ గ్రామానికి చెందిన యువతి స్నేహలతపై గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో ప్రవేశించి పెట్రోల్‌తో దాడి చేసి నిప్పంటించి పరారైనట్లు ఫిర్యాదు మేరకు పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. బాధితురాలు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. పోలీసులు ఆస్పత్రిలో బాధితురాలి వాంగ్మూలం నమోదు చేసుకున్నారు. అంతకు ముందు క్లూస్‌టీమ్ అధికారులు ఘటనా స్థలంలో విచారణ చేశారు. యువతిపై పెట్రోల్ దాడి జరిగిందా? ఎందుకు చేశారు, ఎవరూ చేశారనే విషయమై మిస్టరీను ఛేదించేందుకు లోతుగా విచారణ చేపట్టారు. కార్యక్రమంలో కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ వెంకట్‌రెడ్డి ఉన్నారు.